# జోడెడ్ల బండికన్న జోరుగ పోతంది!



కొండంపల్లి కోటేశ్వరమ్మ

ఆ వూళ్ళో అన్నీ గుడిశలే!

అడవి కంప దడులతో కట్టుకున్నవే అవన్నీ.

ఆ గుడిశల్లో రేయి. పగలు తెలియని కష్టజీవులు కాపురాలున్నాయి.

అక్కడ మల్లెపొదలమధ్య మర్రిచెట్టు లాగా పెద్ద భవంతికూడా వుంది అది ఇసుక. సిమ్మెంటు. ఇనుములతో కట్టించు కున్నది. ఆ భవనం ఆ వూరి కామందు గారిది.

అప్పలకొండని ఆ ఇంటి ముందునుంచి గెంటుకుంటూ తీసుకు వస్తున్నారు. ఇద్దరు యెర్రటోపీల వాళ్ళు.

వాళ్ళేసుకున్న కాకీబట్టలాగా నిలబడి చూస్తున్నాడు ఆ ఇంటి యజమాని. అప్పలకొండని గుండె చప్పుడు లాగా వెళ్ళిపోతున్నారా వూరి జనం.

షాహూకారందించిన సారా తాగినవారి కళ్ళకే తన వేడిని. మెరుపును అందించి. సాక్ష్యం చెప్పాల్సి వస్తుందనుకున్న కర్మ సాక్షి సూర్యుడు పడమర కొండ దిగి పరుగున వెళ్ళిపోయాడు.

ఆ చీకట్లో అమ్మని విడువని చిన్నతనం ఊరును వదలని వెర్రితనం. మినహా లాటీలు పైన పడినా లారీని ఎక్కమన్నా ఎక్కడికి? ఎందుకు....? అని అడగనూ లేదు అప్పలకొండ.

* * *

బాధ్యత తప్పించుకోలేని సూర్యుడు ఎరుపెక్కి తూర్పు కొండపైకి ఎక్కుతూ వస్తున్నాడు.

ఎరుపు తగ్గిన కళ్ళతో ఇద్దరు యెర్ర టోపీలవాళ్ళు అక్కడంతా చూసి అక్కడి కొచ్చిన మరో యిద్దరు యెర్ర టోపీల వాళ్ళకి అప్పలకొండని అప్పగించి చక్కా (వెళ్ళి)పోయారు.

అడుక్కొనేవాళ్ళనూ. పాడుకునేవాళ్ళనూ. పేకాడుకొనేవాళ్ళనూ ఇంటర్వ్యూల కెళ్ళే వాళ్ళను. ఇంటి నుంచి పారిపోయేవాళ్ళను. కుములుతున్నవాళ్ళను. జలసాగా కిళ్ళీలు నములుతున్నవాళ్ళనూ. యెక్కించుకొని కూర్చుని కునికిపాట్లు పడుతూ రాజకీయాలు మాట్లాడుకుంటున్నవారిని కిమ్మనకుండా మోసుకుంటూ నడుము ఈడ్చుకుంటూ పట్టాలు తప్పకుండానేవస్తూ వచ్చజెండాను చూపండంటూ అరుస్తూ సోంపేట ప్లాటు ఫామ్ మీదికి వచ్చింది ఎక్స్‌ప్రెస్.

"బండెక్కడం చేతకాదురా? యెద్దు లాగ యెదిగావు" అంటూ మెడ బట్టి బండిలోకి తోశారు యెర్ర టోపీల వాళ్ళు అప్పల కొండని. బండి కదిలింది. వేగం పుంజుకుంది.

* * *

అప్పలకొండడికి భయం. దిగులు మాయమయాయి. కన్నుల్లో ఏదో ఉత్సాహం ఉబికింది గేటులో పడ్డవాడు లేచి సీటులో కూర్చుంటూ యెగా దిగా చూస్తూ. లేస్తూ.

"జోడెడ్ల బండికన్నా జోరుగా పోతంది....దీన్నెతంతరు బాబూ?"అంటూ బైటకు తలపెట్టి చూశాడు.

"అయ్యో బాబోయ్! ఇది ముందుకెల్లి పోనాదనుకుని చెట్టు గిర్రా యెనక్కెనక్క యెల్లిపోనాయ్...." అంటు తనకేదో కొత్త విషయం తెలిసినట్లు ప్రక్కవారి నడుగుతున్నాడు అప్పలకొండ


వాళ్ళు పకపక నవ్వుతున్నారు.

"మానవుడు చంద్రమండలంలోకి ప్రయాణం చేస్తుంటే... రైలు ప్రయాణం తెలియని.... చేయని ఇలాంటి మానవులు కూడా వున్నారన్నమాట....! అనుకుంటూ ఆశ్చర్యంగా చూశారు అప్పల కొండని.

ఎర్ర టోపీల వాళ్ళు అప్పల కొండ భుజంపై లాటీనిపెట్టి "యెర్రి వేసాలు వేస్తున్నావురా....? నా కొడక.... మక్కలిరగతన్ని.... బొక్క లోకి తోసినప్పుడు తెలుస్తుంది ఈ సంబరం సర్దాల అర్థం" అంటూ అందరివైపు చూశారు.

* * *

"ఈ వెధవ వాళ్ళవూరి కామందు ఇంట్లో.... పాతర తీస్తానని వచ్చి ఇంటి వారి కంట్లు కప్పి. రెండు బస్తాల జొన్నలు దోచుకుపోయాడు. సమయానికి మావాళ్ళక్కడ వుంటే ఆయనగారు ఈ ఉదంతం చెప్పి 'మా వాళ్ళ కప్పగించాడు. వీడు అమాయకత్వం నటించి.... మా కళ్ళకూడ కప్పి తప్పించుకోవాలనుకొంటున్నాడు"అంటూ ప్రక్క ఎర్రటోపీ




మనిషిని చూసి "కనిపెట్టుకొని మనం చూస్తు వుండాలి. ఈ నాయాల తప్పించుకుపారిపోతె మన బ్రతుకులు బండలౌతాయి.... అని హెచ్చరించాడు హెడ్డుగారు.

అప్పలకొండ నెత్తిబాదుకుంటూ "నాను దొంగను కాను బాబూ కాన"న్నాడు.

నోరు ముయ్యమన్నాడు హెడ్డుగారు నోరు మూసుకున్న అప్పలకొండ యెదలో యెన్నో కదిలాయి.

* * *

ఆ నాడు సాహుకారింట్లో బంగారు సరుకు సాహుకారు కొడుకు దొంగతనంగా తీసుకుంటే ఆ నేరం ఆ యింట్లో పని చేస్తున్న తన అమ్మ మీదకు నెట్టి సరుకుకు బదులుగా సంవత్సరాలు ఉచితంగా ఊడిగం చేయించుకున్నాడు సాహుకారు.

ఆడుకొనే వయస్సప్పుడే ఆయనగారి గొడ్లను కాస్తూ పెరిగాడు తను. బాకీ తీరదా? అని భయపడుతూ....అడిగిన ....అమ్మను తనను ఇంటికెళ్ళమన్నాడు సాహుకారు.

కొంత స్వేచ్ఛ వచ్చిన తనూ, తల్లి రోజూ కూలితో రోజులు వెళ్ళబుచ్చుతున్నారా వూరిలోనె.

ఆనాడు పాతర తీయమని కబురంపిన సాహుకారు.... పగలంతా పనిచేయించుకుని కూలిగించలీయకుండా కూడుతినిపొమ్మంటే అమ్మ ఆకలి తలపుకొచ్చిన ఆనాటి కథ యెదలో కదిలి. కోపం హెచ్చి.... తనకు రావలసిన కూలి గింజలను పంచకొంగున మూటకట్టుకుంటుంటే సాహుకారు చూశాడు.

అదిలించాడు. ఆగమన్నాడు. యెదటికొచ్చిన యెర్రటోపీల కప్పజెప్పాడు. రెండు శేర్ల జొన్నలకు (తనకు న్యాయంగా రావలసిన) రెండు బస్తాలని చెప్పి వెర్రి దొంగను చేశాడని వెక్కి వెక్కి యేడ్చాడు. అప్పలకొండ ప్రక్కవారికి చెప్పాలనుకున్నాడు. యెర్రటోపీలకు భయపడ్డాడు. కండ్లు తుడుచుకున్నాడు.... కర్మను నిందించాడు. ఎదుటివారిని చూస్తూ ఏడుపు నాపాడు.

ఆ ఏడుపువాడి కండ్లు యెర్ర టోపీలకేమి చెప్పినయ్యో....? యెదిగావు యెందుకురా....? వెర్రి వెదవా....?" అన్నారు. "అవునూ. అలనాటి రాములోరు తప్పు చేయని సీతమ్మోరిని అడవికంపాడని అమ్మ చెప్పుతూ సీతమ్మోరి చెరలు తప్పవనేది" ఆ మాట గుర్తుకొచ్చి....వూరట చెందాడు వూసుకున్నాడు.

"బాబూ! మీ రుమాలు కింద పడిపోనాది....!"అంటూ రెండో చేత్తోతీసి(బేడీలు లేని చేతితో) దిగటానికి రడీ అవుతున్న వారి కందించాడు అప్పలకొండ

బండి శ్రీకాకుళం స్టేషనుకొచ్చింది. పెట్టెలోని పాసింజర్సు దిగుతున్నారు. అప్పలకొండని తీసుకొని యెర్ర టోపీలు కూడా దిగాయి.

* * *

ప్లాటుఫామంతా సందడి. అటు ఇటు తిరిగేవాళ్ళు. ఆ తొందరపాటులో ఒకర్ని ఒకరు ఢీకొని సారీలు చెప్పేవాళ్ళు. సహచరులను సాగనంపే వాళ్ళు. చంక బిడ్డలతో చెకచెక నడిచే ఆడవాళ్ళు. ఈగలతో వియ్యమందుతున్న రాత్రి మిగిలిన మినపట్లు. పూరీల ప్లేటు....రేకులు రాలిపోతున్న రాత్రి విచ్చిన పువ్వుల బుట్టలు. సామాన్లు మోసుకొస్తున్న కూలీలు. హడావుడి. ప్లాటుఫారమంతా ఒకటే హడావుడి.

"కలికాలం గురూ! కలికాలం. కాని స్టేబుల్స్ని చూస్తేకాస్తకూడా భయంలేదు జనానికి" అంటున్న హెడ్డుగారు. ఆ వెనక అప్పలకొండ. ఆ వెనుక రెండు యెర్రటోపీలు. ఆ సందడిలో జొరబడ్డారు.

"అయ్యో నా గొలుసు! శతమానం గొలుసు! తెంచుకుపోతున్నాడు పట్టుకోండి....పట్టుకోండంటోంది ఒక ఇల్లాలు. అప్పలకొండ పరుగున వెళ్ళి పట్టుకోవాలని చూశాడు. చేతికి బేడీలు. యెర్రటోపీల చేతులలోతను. "అదేబాబు!అదన్నట్టుకోండి" అంటూ వేలెట్టి చూపించాడు

"ఆడుపోనాడు పక్కోడి జేబిలో పర్సు దొబ్బి–బేగెల్లి ఈడన్నట్టుకోండం"టు ఆతురతను వ్యక్తం చేశాడు వేలుపెట్టి చూపే అప్పలకొండ.

రెండవ పోలీసు ముందుకు చూస్తూ పరుగున వెళ్ళి వాడ్ని పట్టుకుందాం!" అన్నాడు హెడ్డుగారితో....

"నేలకు పోయేదాన్ని నెత్తికి రాసుకున్నట్లౌతుందా....? పట్టుకున్నది బంగారమౌతుందా....? ఆలోచించి అడుగేయాలి ఈనాటి పోలీసు" అంటూ అటువైపు తేరిపార చూసి. "అయ్యో బాబోయ్ ఆడు యస్సైగారి స్నేహితుని కొడుకు. 'యెమ్మెల్లే'గారి బావమరిది కూడాను. అలాంటి పలుకుబడి వున్న నా కొడుకుల్ని ముండల కంపెనీలో వున్నా ముట్టుకోరాదు....! చోరీ నేరం చేసినా పట్టుకోరాదు. కొత్తవాడివి. డ్యూటీపస్టు అన్నావో ఏదో నెపంమీద బదిలి చేయిస్తారు. పదిమందిలో పరువు పోతుం దనుకుంటె కరుణవీడి నిన్ను సస్పెండుకూడా చేయిస్తారు. కాబట్టి వూరు కొసడం మంచిదంటూ బ్రతుకు తెరువు పాఠాలు ప్రబోధించారు....హెడ్డుగారు రెండవ పోలీస్ని

అటే చూస్తున్నాడు రెండవ పోలీసు. అటు చూడకురా! చూసికూడ పట్టుకోలేదంటారు పాసింజర్లు పోలీసులు. దొంగలు ఒకటేనంటారు. ప్రతిపక్షాలవారు పత్రికలు పనిగట్టుకొని ప్రకటనకూడా చేస్తాయి. మనం యెంత తొందరగా ఇక్కడ నుంచి వెళ్ళిపోతే అంత మంచిదంటూ స్టేషన్ బైటకు దారి తీశారు హెడ్డుగారు.

అప్పలకొండ కళ్ళకు వెలుగు కనిపించినట్లుగా "మంచి మరి మాటాడకు ఎనక్కెల్లిపోనాది? (చెట్టు పుట్ట నాగ) జోడెడ్లబండి కన్న జోరుగా పోతందా? దీన్నేంతంతరు బాబు?" తనలో తను అనుకుంటున్నాడు అప్పలకొండ.

"ఏమిటిరో? గొనుక్కుంటున్నావు యెర్రినాయాల?పదపద" అంటూ గెంటారు పోలీసులు.

"నాకేటి తెల్దు! నానేతంతను బాబు?" అంటూ వాళ్ళ వెంట వెళ్ళాడు అప్పలకొండ.